

పాహిమాం.. అన్నపూర్ణాదేవి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.



శతమానం భవతి..

పాలకొల్లులో బుధవారం జరిగిన మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.. వధూవరులను ఆశీర్వదించారు.

వివరాలు 9లో..



బిల్లుల గోల



- కోర్టుకెక్కుతున్న కాంట్రాక్టర్లు
- వైసీపీ హయాంలో ప్రాజెక్టులు
- బిల్లులు మంజూరు చేయకుండా తాత్సారం
- జిల్లాలో కోట్ల రూపాయల పెండింగ్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో మంచినీటి సరఫరా కోసం నీటి శుద్ధిప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. వైసీపీ హయాంలో దీనికోసం రూ.5 కోట్లు కేటాయించారు. చివరి దశకు పనులు చేరుకున్నాయి. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం రూ.3.50 కోట్లు బకాయిపడింది. బిల్లులు చెల్లించకపోవడంతో నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణాన్ని కాంట్రాక్టర్ నిలిపివేశాడు. పనులు నిలిచిపోయి దాదాపు రెండేళ్లు కావచ్చింది. కూటమి ప్రభుత్వంలో బిల్లులు మంజూరవుతాయని భావించారు. ప్లాంట్ నిర్మిస్తే తాడేపల్లిగూడెం ప్రజలకు మంచినీటి సమస్య తీరుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. బిల్లులు ఇవ్వనిదే పనులు చేయలేమంటూ కాంట్రాక్టర్ తేల్చిచెప్పారు. బిల్లు మంజూరు కాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఇలా గత ప్రభుత్వంలో పనులు చేసి బిల్లులు రానివారంతా కోర్టు మెట్లెక్కుతున్నారు. భీమవరంలోనూ అమృత్ ప్రాజెక్టులో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌లు కోర్టును ఆశ్రయించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

తాడేపల్లిగూడెంలో గణేష్ నగర్ జంక్షన్ నుంచి ఏపీ నిట్ మీదుగా శశి ఇంజనీరింగ్ కళాశాల వరకు రూ. 7 కోట్లతో సిమెంట్ రహదారిని నిర్మించారు. వైసీపీ హయాంలోనే రహదారికి ప్రతిపాదనలు చేశారు. టెండర్‌లు ఖరారు చేశారు. అప్పట్లో బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్ రహదారి ప్రారంభించ లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాంట్రాక్టర్‌లలో నమ్మకం ఏర్పడింది. గతంలో ఉన్న బకాయిలను కొంత మేర చెల్లించారు. దాంతో పనులు పూర్తి చేశారు. పనులు పూర్తయ్యాక బిల్లులు చెల్లించ లేదు. అదే కాంట్రాక్టర్ పట్టణంలోని ముత్యాలంబపురం నుంచి ప్రత్తిపాడు వరకు రూ. 7 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారి పనులు దక్కించుకున్నారు. పనులు చేపట్టాలంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు చెల్లిస్తేనే రహదారి నిర్మిస్తా మంటూ కాంట్రాక్టర్ తేల్చి చెప్పారు. సదరు రహదారి గోతుల మయం కావడంతో విజయవాడ నుంచి కాకినాడ వెళ్లే బస్సులు, హైదరాబాద్ నుంచి తాడేపల్లిగూడెం మీదుగా వెళ్లే ప్రైవేటు బస్సులు పట్టణంలోకి రావడం లేదు. బైపాస్ రహదారి వద్ద దించేస్తున్నారు. అక్కడ నుంచి రాత్రిపూట ఆటోల్లో రావాల్సి వస్తోంది. పట్టణ ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందంటూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసెంబ్లీలో ఇదే విషయంపై మాట్లాడారు.



తాడేపల్లిగూడెంలో నిలిచిపోయిన నీటి శుద్ధి ప్లాంట్



తాడేపల్లిగూడెం- తణుకు రోడ్డులో ప్రత్తిపాడు వద్ద రహదారి దుస్థితి

రూ. 85 కోట్ల మేర పెండింగ్

జిల్లాలోని మున్సిపల్ కాంట్రాక్టర్‌లు బిల్లుల కోసం గగ్గోలు పెడుతున్నారు. గత ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వంలోనూ సిమెంట్ రహదారులు, సీసీ డ్రెయిన్‌లు నిర్మించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ బిల్లులు నిలచిపోయాయి. కొత్త పనులు చేపట్టడానికి ముందుకు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో దాదాపు రూ. 85 కోట్లు మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మున్సిపాలిటీలు చుట్టూ కాంట్రాక్టర్‌లు తిరుగుతున్నారు. బిల్లులు చెల్లించకపోతే కోర్టులకు వెళతామంటూ భీమవరంలో కాంట్రాక్టర్లు మున్సిపల్ అధికారులకు చెపుతూ వస్తున్నారు. వైసీపీ హయాంలో బిల్లులు రావాలంటే ప్రతి కాంట్రాక్టర్ కోర్టు మెట్టు ఎక్కాల్సి వచ్చింది. అప్పుడే బిల్లులు మంజూరు చేశారు. అదికూడా కొర్రీలు పెడుతూ కొద్దిపాటి బిల్లులను చెల్లించారు. నాణ్యత పేరుతో 10 శాతం నిలిపివేశారు. సదరు బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లిస్తూ వస్తోంది. ఇంకా బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడంతో ఇటీవల ప్రభుత్వం మళ్లీ బిల్లుల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చింది.

కొత్త ప్రతిపాదనలకు నో

పట్టణాలు, పల్లెల్లో కొత్త ప్రతిపాదనలకు అధికారులు, సిబ్బంది అంతగా ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టర్‌ల నుంచి స్పందన లేకపోవడంతో అంతా ముభావంగా ఉంటున్నారు. పల్లెల్లో ఉపాధి హామీ నిధులు రూ.47 కోట్లు వెచ్చించి సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మించారు. ఆ బిల్లులు కూడా పెండింగ్‌లో పడ్డాయి. కూటమి శ్రేణులే పనులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. వారిపై ఇప్పుడు ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుతం నియోజకవర్గానికి రూ. 3 కోట్లు ఉపాధి హామీ పథకంలో కేటాయించారు. వాటి కోసం పెద్దగా స్పందన కానరావడం లేదు. మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి. సొంత నిధులతో పనులు చేద్దామన్నా కాంట్రాక్టర్‌లు ముఖం చాటేస్తున్నారు. రాష్ట్ర రహదారుల శాఖలోనూ పనులు ఇబ్బంది కరంగా మారింది. బిల్లులు కోసమే ఇప్పుడంతా చూస్తున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే కోర్టును ఆశ్రయిస్తామంటూ అధికారులను హెచ్చరిస్తున్నారు.



కోతకు గురైన ఏటిగట్టుకు సరుగుడు కర్రలతో అడ్డుకట్ట

కోత గట్టుకు మోక్షం ఎప్పుడో..?

మూడేళ్ల క్రితం వరదకు ఏటిగట్టు కోత

250 మీటర్ల పనులు పూర్తి..ఇంకా 150 మీటర్ల పెండింగ్

నరసాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం గోదావరి వరదకు పట్టణంలోని అమరేశ్వరస్వామి గుడి వద్దనున్న గోదావరి ఏటిగట్టు కోతకు గురైంది. మొదట 100 మీటర్లు నదిలోకి జారింది. తరువాత మరో 50 మీటర్లు కొట్టుకుపోయింది. ఇదే ఏడాది మరోసారి వచ్చిన వరదకు మరో 250 మీటర్ల మేర గట్టు కోతకు గురైంది. అయితే ఎటువంటి ప్రమాదం జరగక్కపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అప్పట్లో తాత్కాలికంగా రూ.50 లక్షలు వెచ్చించి సరుగుడు కర్రలతో అడ్డుకట్ట వేశారు.

రూ.25 కోట్లతో శాశ్వత పనులు

గత వైసీపీ ప్రభుత్వంలో 2023లో అప్పటి సీఎం జగన్ రూ.25 కోట్లతో ఏటిగట్టు పటిష్ఠ పనులకు శంకుస్థాపన చేశారు. 250 మీటర్ల మేర గట్టును పటిష్ఠపర్చి ఏడు మీటర్ల మేర వెడల్పు చేయాలని ప్రతిపాదించారు. నిర్మాణ పనుల్లో సరైన రాళ్లను వినియోగించకపోవడం వల్ల పనులు ఆరంభం నుంచి నదిలో కుంగుతూ వచ్చింది. దీనిపై అప్పట్లో అనేక ఆందోళనలు కూడా జరిగాయి. చివరికి రాళ్లను మార్చి 250 మీటర్ల మేర గట్టు పనులు పూర్తిచేశారు.ఈ పనులు పూర్తయి రెండేళ్లు అయింది. ఇంకా 150 మీటర్ల మేర పనులు పెండింగ్ పడింది. అప్పటినుంచి ఈ పెండింగ్ పనుల్ని పూర్తి చేయలేదు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టకపోవడం వల్ల నది ప్రవాహానికి గట్టు కొద్దికొద్దిగా కోతకు గురవుతోంది. తాత్కాలికంగా వీటికి అడ్డుకట్ట వేసినా భారీ వరద వస్తే పెను ప్రమాదం తప్పదని అధికారులు భావిస్తున్నారు. ఈ గట్టు దిగువ భాగంలో పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతం ఉంది. దాదాపు 1000 కుటుంబాలు పైనే నివాసాలు ఉంటున్నారు. వీరంతా మత్స్యకారులే,

రూ.6 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక : పవన్, ఏటిగట్టు శాఖ ఏఈ



ప్రస్తుతం పెండింగ్ పనులకు రూ.6 కోట్లతో అంచనాలు తయారు చేశాం. ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ విప్ నాయకర్ కూడా ఈ పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి, నీటి పారుదలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరవగానే పనులు చేపడతాం.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



పీఎం లంక గ్రామంలో కోతకు గురవుతున్న సముద్రపు గట్టును పరిశీలిస్తున్న మంత్రి

8



పశ్చిమలోనూ మియవాకీ వనాలు

కొద్దిపాటి స్థలంలో గుబురు అడవి

ఖాళీ స్థలాలు ఇవ్వాలని కోరిన అటవీ శాఖ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అటవీ సంపదను వృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తీర ప్రాంత పరిరక్షణకు సర్వే అడవులు, తాటి చెట్ల పెంపకానికి చర్యలు చేపట్టింది. ఈ ఏడాది తీరంలో 6,500 తాటి చెట్లు పెంచేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా మియావాకీ వనాలను పెంచాలని నిర్ణయించారు. కొద్దిపాటి స్థలంలో గుబురు అడవులను పెంచనున్నారు. స్థానికంగా ఉండే చెట్లను పెంచుతారు. ఒకదానికి ఒకటి పోటీ పడి సన్నగా గుబురుగా చెట్లు పెరిగే అవకాశం ఉంటుంది. జపాన్‌లో ఇటువంటి విధానాన్ని అమలు చేస్తున్నారు. అక్కడ స్థలాల కొరత కారణంగా మియావాకీ అడవులను పెంచుతున్నారు. జిల్లాలోను ఈ అడవులను పెంచాలన్న ప్రతిపాదనపై కలెక్టర్ నాగరాణి సానుకూలంగా స్పందించారు. పట్టణాలు, పల్లెల్లో అందు బాటులో వున్న కొద్దిపాటి స్థలాల వివరాలను అందజేయాలని అటవీ శాఖ రెవెన్యూ అధికారులను కోరారు. ముఖ్యంగా రిజర్వ్‌డ్ స్థలాలు, పోరంబోకు స్థలాలు అందుబాటులో ఉన్నాయి. అక్కడ స్థానిక చెట్లను పెంచేలా కసరత్తు చేస్తోంది.

ప్రయోజనాలెన్నో

గుబురు అడవులు పెంచితే పర్యావరణం కాపాడుకోవచ్చు. ప్రాణ వాయువు అందు బాటులో ఉంటుంది. పట్టణాలు, పల్లెల్లో దుమ్ము, ధూళిని గుబురు అడవులు ఆకర్షిస్తాయి. దుమ్ము నివారణకు దోహదపడతాయి. చల్లదనం ఉంటుంది.ఇది పర్యావరణానికి సానుకూలంగా ఉంటుంది. అందుకోసమే పశ్చిమలోనూ వివిధ రూపాల్లో అటవీ సంపదను పెంచేలా అధికార యంత్రాంగం ప్రణాళిక చేస్తోంది.

వీధి వ్యాపారులకు రుణాలు

- జిల్లాలో లోక్ కల్యాణ్ మేళా ప్రత్యేక కార్యక్రమాలు
- నేటి నుంచి 30 వరకు మునిసిపాల్టీల వారీగా రుణ మేళాలు

జిల్లాలో 14,249 మంది వీధి వ్యాపారులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయదారుల అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. మునిసిపాల్టీలోని మెప్మా సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక్ కల్యాణ్ మేళా పీఎం స్వనిధి 2.0 ద్వారా రుణాలు అందించనున్నది. ఇందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు మునిసిపాల్టీలతో పాటు ఆకివీడులో వీధి వ్యాపారులను గుర్తించారు. పాతవారికి కూడా రుణ సదుపాయం పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ ఏడాది రుణ పరిమితి పెరిగింది. రూ.10 వేల నుంచి గరిష్ఠంగా రూ 50 వేల వరకు ఇవ్వనున్నారు. అయితే గతంలో రూ.10 వేలు ఉన్న ప్రాథమిక రుణం రూ.15 వేలకు పెరి గింది. ప్రారంభంలో రూ.10 వేలు తీసుకొని చెల్లించిన వారికి ఇప్పుడు రూ.25 వేలు ఇస్తారు. రూ.20 వేలు తీసుకొని బాకీ చెల్లిస్తే వారికి 50 వేలు ఇస్తారు. ఇందుకోసం మునిపాల్టీలవారీగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. మెప్మా అధికారులతో పాటు బ్యాంకు అధికారులు పాల్గొని రుణాలు మంజూరు చేస్తారు.

14,249 మంది వీధి వ్యాపారులు

జిల్లాలో మెప్మా సిబ్బంది గతంలోను, ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో 14,249 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లుగా నిర్ధారించారు. ఇందులో భీమవరంలో 3,612 మంది ఉండగా తాడేపల్లిగూడెంలో 3,010, పాలకొల్లులో 3,745, నరసాపురంలో 1,212, తణుకులో 2,585, ఆకివీడులో 85 మంది ఉన్నారు. వీరందరికి రుణం మంజూరుకు చర్యలు తీసుకోనున్నారు. వీరిలో కొంతమంది కొత్త వారు ఉన్నారు. వారికి ఈసారి కొత్తగా రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టనున్నారు.



మేళాలు ఇలా ..

జిల్లాలోని 6 మునిసిపాల్టీలో మేళాలు నిర్వహించేందుకు అధికారులు తేదీలను నిర్ణయించారు. 25న ఆకివీడులో, 26న తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మునిసిపాల్టీల్లో మేళాలు నిర్వహిస్తారు. 29న భీమవరం, 30న నరసాపురంలో నిర్వహిస్తారు. ఆయా రోజుల్లో ప్రత్యేక శిబిరాలు జరుగుతాయి. ఇప్పటికే మేళాలు ఏర్పాటుపై అధికారులు మునిసిపాల్టీల వారీగా వివరాలను సేకరిస్తున్నారు. వీధి వ్యాపారులకు వారి అర్హతను బట్టి 8 పథకాలను అనుసంధానిస్తారు. ఆయా పథకాల గుర్తింపు, ఆరోగ్యకార్డులు అందజేస్తారు. జిల్లాలో వీధి విక్రయదారుల్లో కొంతమంది డిజిటల్ చెల్లింపుల్లో వెనుకబడ్డారు. వీరికి అవగాహన కల్పిస్తారు.

పేదల బియ్యం బొక్కేశారు

- కైకలూరులో రూ.5.47 కోట్ల రేషన్ బియ్యం పక్కదారి
- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరిక

అప్పుడే అక్రమాలు వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి


ఆంధ్రజ్యోతి
ఔరా.. ఇదేమి మాయ!
లెక్క మారింది
నిజమే

2021 అక్టోబరులో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలు

కైకలూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో పేదల బియ్యాన్ని బొక్కేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో రూ.234 కోట్ల కుంభకోణాలకు పాల్పడినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహ ర్ బుధవారం అసెంబ్లీలో వెల్లడించారు. ఏలూరు జిల్లా కైకలూరులో రూ. 5.47 కోట్లు విలువైన రేషన్ బియ్యం పక్కదారి పట్టించినట్లు తెలిపారు. బియ్యం కంభకోణం 2021 అక్టోబరులో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేశారు. తనిఖీకి వచ్చిన అధికారులను సైతం అక్రమార్కులు తప్పు దారి పట్టించారు. దీనిపై ఆంధ్రజ్యోతి 'గోడచాటున' శీర్షికతో కథనం ప్రచురించడం తో అధికారులు ఆ దిశగా తనిఖీలు చేశారు. 2021 అక్టోబరు 28న నిర్వహించిన తనిఖీల్లో పెద్ద కుంభకోణం ఉన్నట్లు సివిల్‌సప్లై అధికారులు గుర్తించారు. వారం రోజులుగా నిర్విరామంగా కైకలూరు, మండవల్లి సివిల్ సప్లై గోదాములలో తనిఖీలు నిర్వహించి రూ.5.47కోట్లు విలువైన బియ్యం కుంభకోణం నిర్ధారించారు. అప్పటి సివిల్ సప్లై గోదాము ఇన్‌చార్జి అధికారి బి.హంళక్కేశ్వరరావు, ప్రైవేటు ఉద్యోగి వెంకన్న (వెంకట్), కంప్యూటర్ ఆపరేటర్ శ్యాంకిశోర్‌పై పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. హంళక్కేశ్వర రావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మిగిలిన ఇద్దరిని కోర్టులో హాజరుపరిచారు. ఇంకా కోర్టులో కేసు కొనసాగుతూనే ఉంది. లోతుగా దర్యాప్తు చేస్తే మరింత అవినీతి బయటకు వచ్చేదని, వైసీపీ నాయకుల అండదండలతో కేసును కొద్దిమేర నీరుగార్చినట్లు విమర్శలు వచ్చాయి. ఓ పోలీసు అధికారి ఈ కేసును తప్పుదారిని పట్టించేందుకు రూ.8 లక్షలు తీసుకున్నట్లు ఆ సమయంలో కైకలూరులో గుప్పుమంది. ఆ తరువాత కాలంలో కూడా అనేక ప్రాంతాల గోదాముల్లో పీడీఎస్ రైస్ పక్కదారి పట్టినట్లు విమర్శలు వచ్చాయి. అవినీతి లెక్కలపై కూటమి ప్రభుత్వం ఆరా తీయడంతో కుంభకోణంలో పెద్దలందరూ బయట పడతారని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేసి పీడీ యాక్ట్‌ను అమలుచేస్తే పేదలకు న్యాయం జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

అన్నపూర్ణదేవి దర్శనం

ఉమ్మడి జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దసరా ఉత్సవాల్లో మూడో రోజు అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మ, జంగారెడ్డిగూడెంలో వాసవీ కన్యకా పరమేశ్వరి, ఏలూరు సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మిదేవి, అంబికా దేవి అమ్మవార్లు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. తాడేపల్లిగూడెంలోని శ్రీవాసవీ కన్యకా మాత, ఆచంట పార్వతి అమ్మవార్లు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. భీమవరం పట్టణంలోని మావుళ్లమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లు గాయత్రీదేవి అలంకరణ చేశారు. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.





ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మ.. బుట్టాయగూడెం గుబ్బల మంగమ్మకు గాజుల అలంకరణ.. రాట్నాలకుంటలో అలంకరణలో రాట్నాలమ్మ





భీమవరంలో గాయత్రిదేవిగా మావుళ్లమ్మ.. కాళ్లకూరులో ధైర్యలక్ష్మి అమ్మవారు.. తాడేపల్లిగూడెంలో వాసవీమాత





జంగారెడ్డిగూడెంలో వాసవీ కన్యకా పరమేశ్వరి.. సత్రంపాడులో సౌభాగ్యలక్ష్మిదేవి.. అంబికాదేవి అమ్మవార్లు



తాడేపల్లిగూడెం 17వ వార్డులో టీడీపీ నేత గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో విశ్వదుర్గేశ్వరి అమ్మవారిని, ఆలయాన్ని రూ.50,30,000 కరెన్సీ నోట్లతో అలంకరించారు.





భీమవరంలో గాయత్రిదేవిగా కనకదుర్గమ్మ.. ఎల్‌బీచర్లలో గంగాలమ్మ.. ఆచంట పార్వతి అమ్మవారు




పేరుపాలెంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల. బండి ముత్యాలమ్మకు పూజలు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

▸ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

నరసాపురం/మొగల్తూరు, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి):నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే స్కిల్స్‌ను మెరుగుపర్చుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. నరసాపురం మండలం పీఎంలంక గ్రామంలో వున్న డిజిటల్ భవనాన్ని ఆయన సందర్శించి విద్యార్థులకు ఇస్తున్న శిక్షణపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడో సముద్రపు ఒడ్డున ఉన్న ఈ గ్రామానికి, ప్రజలకు ఏదో చేయాలన్న తపనతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతి క్షణం ఆలోచిస్తున్నారన్నారు. త్వరలో ఇక్కడ పిల్లలకు మెరుగైన విద్య కల్పించేందుకు మహానగరాలకు దీటుగా ఆమె క్వాలిటీ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో కోతకు గురవుతున్న సముద్రపు గట్టు, చేపడుతున్న పనుల్ని పరిశీలించారు. ఈ గ్రామ అభివృద్ధికి, జరుగుతున్న పనులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రభుత్వ విప్ నాయకర్‌కు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వసంతరావు, తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, మైలా వసంతరావు, పేరాల మోహన్, వాతాడి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోపు ఆలయ నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ నిధులతో మొగల్తూరు మండలం పేరుపాలెంలో చేపట్టిన ఆలయ నిర్మాణ పనులు ఏడాదిలోపు పూర్తి చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. బుధవారం మొగల్తూరు మండలానికి విచ్చేసిన ఆయన ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మను దర్శించుకుని పేరుపాలెంలో నిర్మాణంలో ఉన్న చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు, అదే ప్రాంగణంలో నిర్మించనున్న సీతారాముల ఆలయ నిర్మాణ స్థలాలను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌తో కలిసి పరిశీలించారు. ఆలయ నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని అందించిన స్థల దాతలను మంత్రి అభినందించారు. సర్పంచ్ పేరుపాలెం వెంకన్న, మేళం బన్ను, చెన్నాప్రగడ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా : డీఎంహెచ్‌వో

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని స్కానింగ్ సెంటర్లన్నింటిలో క్రమం తప్పకుండా పూర్తిస్థాయిలో తనిఖీలు చేసి, నివేదికలను అందజేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం ఆదేశించారు. బుధవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గర్భస్థపిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ (పీసీ పీఎన్డీటీ)చట్టం అమలుకు ఏర్పాటైన జిల్లా సలహా మండలి అధికారులు, సభ్యులు, వైద్యాధికారులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమీక్షించారు. ఆడపిల్లల నిష్పత్తి తక్కువగావున్న గ్రామాల్లో ప్రత్యేక నిఘాపెట్టి, స్థానికులకు అవగాహన కల్పించడం ద్వారా బాలికల నిష్పత్తి పెంచాలని ఆదేశించారు. సంతాన సాఫల్య కేంద్రాల కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తుండాలని కోరారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీకిరణ్, పీడియాట్రిస్టు డాక్టర్ సుజాతదేవి పాల్గొన్నారు.

28న సాహితీ పట్టాభిషేక మహోత్సవం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రపంచ తెలుగు సంస్కృతి కళావేదిక, తెలుగు రైటర్స్ అకాడమీ, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న సాహితీ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామని ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కవులు, సాహితీవేత్తలు, రచయితలకు ఈ సందర్భంగా సాహితీ కిరీటి అవార్డుల ప్రదానం చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక 155వ కార్యక్రమంగా నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన సాహితీవేత్తలకు అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమానికి కళారత్న బోయి హైమావతి, సాహితీవేత్త పద్మశ్రీ, ఆచార్య కొలకులూరి ఇనాక్, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, మిస్ యూనివర్స్ ట్రాన్స్, మేకల హర్షిణి పాల్గొంటారన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శనివారపు పేట జడ్పీ పాఠశాల క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు శనివారపుపేట జడ్పీ విద్యార్థులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 25, 26 తేదీల్లో కర్నూలులో జరిగే 8వ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు శనివారపుపేట జడ్పీ విద్యార్థులు జె.ఆకాశసుందర్, టి.మరియజోష్, జె. శ్యాంసుందర్, జి.జాన్‌పాల్, ఎ.అరవింద్, నవీన్‌కుమార్, సి.ఎతిక్ రత్న, పి. శివరామకృష్ణ ఎంపికయ్యారు. వీరు ఏలూరు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ పద్మలత, షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ గణేష్, క్రీడాకారులను అభినందించారు.

ఏమిటిది స్వామీ..

ఫ్రీ బస్సులతో దేవాలయాలకు పెరగని హుండీ ఆదాయం



శ్రీవారి ఆలయ మెట్లదారిలో బుధవారం మహిళా భక్తుల సందడి



బస్టాండ్‌లో కిటకిలాడిన భక్తులు (ఫైల్)

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణాలతో పుణ్యక్షేత్రాలు పోటెత్తుతున్నాయి.. కానీ వారి ద్వారా ఆలయాలకు రాబడి ఏమాత్రం పెరగలేదన్నది తేటతెల్లమౌతోంది. ఉమ్మడి జిల్లాలో క్షేత్రాలైన ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయుడి క్షేత్రం, పారిజాత గిరి, వాడపల్లి, భీమవరం మావుళ్లమ్మ, పంచారామ తదితర క్షేత్రాలు ఫ్రీబస్సు ప్రయాణాలు వచ్చిన నాటి నుంచి మహిళా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. గతంలో ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి శని, ఆది వారాలు మినహా మిగిలిన రోజుల్లో భక్తుల రద్దీ సాధారణంగా ఉండేది. మంగళ, శుక్రవారాలైతే మరింతగా అంటే వందల్లోనే భక్తులు ఆలయంలో కన్పించేవారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆగస్టు 15 నుంచి ప్రారంభమైంది. ఈమేరకు మంగళ, శుక్రవారాల్లో సైతం ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. వారంతా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలకు తమస్నేహితులు, బంధువులతో కలిసి జిల్లాలు దాటి మరీ వెళ్లొస్తున్నారు. గత, ఆపై శనివారాలైతే ద్వారకాతిరుమల ఆలయానికి పురుష భక్తుల కంటే మహిళా భక్తులే ఎక్కువగా వచ్చారు. ఆలయ పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాలు మహిళలతో పోటెత్తాయి. ఇంతమంది భక్తులు ఆలయానికి వస్తే విపరీతంగా పెరగాల్సిన ఆలయ హుండీల ఆదాయం మాత్రం చిన్నబోతోంది. హుండీల సొమ్ము ఆదాయం చూస్తుంటే మహిళా భక్తుల కారణంగా ఆదాయం ఏ మాత్రం పెరగలేదు అనిపిస్తోంది. బుధవారం సైతం ఆలయం మహిళా భక్తులతో కళకళలాడింది.

హుండీల ఆదాయం ఇలా..

గత ఆగస్టు నెల 25న జరిగిన లెక్కింపులో హుండీల ఆదాయం 38 రోజులకు గాను రూ.3.61కోట్లు వచ్చింది. అంటే రోజుకు హుండీల ద్వారా స్వామికి రూ.9.50 లక్షలు వచ్చినట్లే. ఆ తరువాత ఈనెల 24న జరిగిన లెక్కింపులో 31 రోజులకు గాను రూ.2.18కోట్లు ఆదాయం లభించింది. రోజుకు హుండీల ద్వారా రూ.7.03 లక్షలు వచ్చింది. ఆగస్టు అంతా శ్రావణమాసం కావడం వివాహాలు అధికంగా జరగడంతో మూడున్నర కోట్ల రూపాయల పైబడి ఆదాయం లభించింది. ఈ సెప్టెంబరు మాసం శూన్యమాసం అయినా మహిళా భక్తులు విశేషసంఖ్యలో వచ్చారు అధిక ఆదాయం వస్తుందని అందరూ భావించారు. కానీ 31 రోజులకు రూ.2.18 కోట్లు లభించడంతో ఆదాయంపై మహిళా భక్తుల ప్రభావం కన్పించలేదు. గతేడాది 2024న ఇదే రోజుల్లో సెప్టెంబరు 18న ఆలయ హుండీలు తెరిస్తే 28రోజుకు రూ.2.05 కోట్లు ఆదాయం వచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే ఆలయాలు.. ఫుల్.. ఆదాయం నిల్‌గా చెప్పొచ్చు.

31 రోజులకు రూ.2.18 కోట్లు

శ్రీవారి ఆలయంలో బుధవారం లెక్కించిన హుండీల ద్వారా ఆదాయం సమకూరింది. 31 రోజుల కాలానికి జరిగిన ఈ లెక్కింపులో స్వామికి నగదు రూపేణా రూ. 2.18 కోట్ల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. స్థానిక ప్రమోద కల్యాణ మండపం ఆవరణలో అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈ నగదుతోపాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 120 గ్రాముల బంగారం, 4.079 కేజీల వెండి లభించిందన్నారు. రద్దయిన పాత నోట్లు రూ. 500(16), 2000(2)తో పాటు విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.



శ్రీవారి ఆలయ హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

నాడు ఖాకీలు.. నేడు టీచర్లు

ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో డీఎస్సీలో ఎంపికైన నలుగురు కానిస్టేబుళ్లు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వారంతా వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చినవారే. కష్టపడి చదివారు. ఉపాధ్యాయులుగా రాణించి పేద విద్యార్థులను విద్యావంతులుగా చేసి సమాజాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఉపాధ్యాయ వృత్తిని ఎంపిక చేసుకోవాలని ఆ దిశగా వారు ఉపాధ్యాయ వృత్తి కోసం విద్యను అభ్యసించారు. ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది.. హమ్మయ్యా అంటూ హాయిగా తమ ఆలోచనలను పక్కనపెట్టలేదు. ఆర్థిక స్వావలంబన కోసం ఓ ఉద్యోగాన్ని పొందారు. ఆ ఉద్యోగంలో క్రమశిక్షణతో విధులను నిర్వర్తిస్తున్నారు. ఆ వృత్తిలో క్షణం తీరిక లేకపోయినా తమ ఆశలను అడియాసలు చేయలేదు. వారు అనుకున్న ఆలోచన ప్రకారం ఏనాటికైనా ఉపాధ్యాయులుగా వృత్తిలో చేరి సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని వారి మనస్సులో బలంగా నాటుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరి 12 ఏళ్లపాటు విధులను నిర్వర్తిస్తూ ఏనాటికైనా తాను చదివిన ఉపాధ్యాయ వృత్తికోసం వేచి చూసిన వారు ఒకరు కాగా, ఉద్యోగం వచ్చింది కదా అని పెళ్లిళ్లు అయ్యాయి కదా.. అని అనుకోకుండా పట్టుదలతో తమకు దొరికిన సమయంలోనే వారు ప్రిపేర్ అయ్యారు. అనుకున్న విధంగానే వారి ఆశలను నెరవేర్చుకున్నారు. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆ నలుగురు కానిస్టేబుళ్ల తన కార్యాలయంలో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎస్పీ వారికి సూచించారు.



టీచర్లుగా ఎంపికైన కానిస్టేబుళ్లను సన్మానించిన జిల్లా ఎస్పీ కిశోర్

భర్త ప్రోత్సాహంతో సాధించా : శీర్ల వనజారాణి



మాది జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామం. రెండేళ్ల బాబు ఉన్నాడు. చదువుకునే రోజుల నుంచే కోకో, రోప్ స్కిప్పింగ్‌లో జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించా. నాగార్జున వర్సిటీలో బీపీఈడీ చదివా. 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికై పోలీస్‌శాఖలో చేరాను. ప్రస్తుతం లక్కవరం పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్నా. నాకు డ్రిల్ మాస్టార్ అవ్వాలని కోరిక ఎక్కువగా ఉంది. టీచర్‌గా అయితే ఈ అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆలోచనతో ఉన్నా.. పోలీస్ ఉద్యోగం చేస్తున్నప్పటికీ నా ఆలోచన ఏనాటికైనా డ్రిల్ మాస్టర్‌గా రాణించాలనే ఆలోచన ఉంది. తన భర్త డేగల శ్రీనివాస్ ప్రోత్సాహంతోనే డీఎస్సీ పోటీ పరీక్షలకు ప్రిపేరై ఉద్యోగాన్ని సాధించా.

టీచర్ కావాలనే ఆశతోనే : పోతుల అఖిల శ్రావణి



చిన్ననాటి నుంచి టీచర్ అంటే చాలా ఇష్టం. మాది కైకలూరు. కైకలూరులోని జడ్పీ ఓరియంటల్ హైస్కూల్లోనే చదివా. విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివి, 2014 నుంచి 2016 వరకు దూబర్ల డైట్‌లో డీఎడ్ చేశా. మా తల్లి దండ్రులు వ్యవసాయదారులే. అన్నయ్య మణికంఠ, అక్క కీర్తి, అమ్మనాన్న రాఘవేంద్ర, శేషవేణి చిన్నప్పటి నుంచి తాను టీచర్ అవ్వాలని అల్లారు ముద్దుగా పెంచారు. నిరుద్యోగిగా ఉండడం ఇష్టం లేక 2020లో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరాను. టీచర్ ఉద్యోగం సాధించాలని అప్పటి నుంచి సమయం దొరికినప్పుడల్లా చదువుతున్నా. ప్రస్తుతం మండవల్లి పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులను నిర్వర్తిస్తున్నాను. కానిస్టేబుల్‌గా ఉద్యోగం ఎంతో సంతృప్తినిచ్చింది. ఉపాధ్యాయురాలిగా చూడాలనే మా కుటుంబ సభ్యుల కోరిక నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది. పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తా.

12 ఏళ్ల నుంచి ఎదురుచూశా : మోటూరి సుబ్రహ్మణ్యం



మా స్వగ్రామం గోపాలపురం మండలం చిట్యాల. తల్లిదండ్రులు వ్యవసాయ దారులే. 2013లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను. తాడేపల్లిగూడెం, చేబ్రోలులో పనిచేసి ప్రస్తుతం ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మూడు నెలల క్రితమే చేరా. 2018లో డీఎస్సీలో అర మార్కు తక్కువై ఉద్యోగాన్ని కోల్పోయా. ఎంతో వేదనకు గురయ్యా. ఏమైనా సరే ఉపాధ్యాయుడిగా చేరి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నా. నా సతీమణి సురేఖ టీచర్‌గానే పని చేస్తోంది. మాకు ఇద్దరు అమ్మాయిలు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా ఉద్యోగం పొందాను.

సమయాన్ని వృథా చేయలేదు : ఉయ్యాల శ్రీనివాసరావు



మాది చింతలపూడి మండలం పోతులూరు. మానాన్న ఐటీడీఏలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. మాఅమ్మ గృహిణి. బీఎస్సీ, బీఈడీ చదివా. నా సతీమణి శిరీక్ష ఎంఎస్సీ బీఈడీ, మాకు ఇద్దరు అబ్బాయిలు. ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్నారు. 2018లో కానిస్టేబుల్‌గా చేరాను. టీచర్ అవ్వాలని సమయం దొరికినప్పుడల్లా చదువుతున్నా.. పోలీస్ శాఖలో పనిచేయడం వల్ల సమాజ పరిస్థితులు తెలుసుకున్నా.. ప్రతి ఒక్కరికి విద్య అనేది ఉంటే వీలైనంత వరకు చెడు వ్యసనాలకు బానిసలు కారు. ఉపాధ్యాయ వృత్తిద్వారా ఎంతో మంది బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చు. లెక్కల్లో ప్రావీణ్యం ఎక్కువగా ఉంటే భవిష్యత్తులో ఎంతో మంది శాస్త్రవేత్తలుగా వెలుగొందుతారు. స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) ఉద్యోగం పొందాను.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం పథకంలో కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డీఆర్‌వో విశ్వేశ్వరరావుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు 3,200 మంది పనిచేస్తున్నారన్నారు. వీరికి మూడు నెలల నుంచి వేతన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వీరికి ఇచ్చే వేతనం రూ. మూడు వేలు అవి కూడా నెలలు తరబడి పెండింగ్ పెట్టడం చాలా కష్టతరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలలు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్వీడీ ప్రసాద్, ఇస్సాక్, రాంబాబు, రమణారావు, చంద్రకళ, లక్ష్మి, శ్రీలక్ష్మి, కుమారి, రాజేశ్వరి, పుష్ప, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్'లో అరుదైన శస్త్రచికిత్స

▸ గొంతులో ఇరుక్కున్న ఎముకను తొలగించిన వైద్యులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మాంసం తింటున్న సమయంలో పొరపాటున ఎముక ముక్క అన్ననాళంలో ఇరుక్కుపోగా.. తిన్నది మింగలేక, ఊపిరాడక కుప్పకూలేస్థితికి చేరుకున్న ఓ వ్యక్తికి ఏలూరు ఆయుష్ హాస్పిటల్ వైద్యులు ఎండో స్కోపితో శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాలను ఆసుపత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి బుధవారం స్థానిక మీడియాకు తెలిపారు. గొంతులో ఎముక ఇరుక్కున్న వ్యక్తిని కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఆయుష్ ఆసుపత్రికి తీసుకురాగా, హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, హెపటోబిలియరీ అండ్ బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ అత్యవసర విభాగంలో పరీక్షించి ఎండోస్కోపీ చికిత్సతో ఎముకను సురక్షితంగా తొలగించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. డాక్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మాంసం తినేటప్పుడు ఎముకలు జాగ్రత్తగా నమలాలని, గొంతులో ఏ వస్తువు ఇరుక్కుపోయినా ఇంట్లో ప్రయత్నాలు చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదిస్తే ప్రాణాపాయం ఉండదు. శస్త్ర చికిత్సకు అనస్థీషియా నిపుణులు డాక్టర్ రాజేష్, సిబ్బంది సహకరించారు.



రోగితో ఆయుష్ హాస్పిటల్ వైద్యులు (ఇన్‌సెట్‌లో) ఎముక ముక్క


సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, మంత్రి నిమ్మలకు గజమాల


సీఎం చంద్రబాబుకు మహిళల స్వాగతం


ప్రజలకు మంత్రి లోకేశ్ అభివాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న బాలకృష్ణ


హెలీకాప్టర్ దిగి వస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి

నిరాడంబరుడు నిమ్మల

- సీఎం చంద్రబాబు కితాబు.. రామానాయుడి కుమార్తె వివాహ వేడుక..
- వధూవరులను ఆశీర్వదించిన సీఎం దంపతులు, లోకేశ్

పాలకొల్లు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ, దుర్గాహరిహర సాయి పవన్‌కుమార్‌ల వివాహం బుధవారం పాలకొల్లులో వైభవంగా జరిగింది. వధూవరులను సీఎం చంద్రబాబునాయుడు, భువనేశ్వరి, వారి కుమారుడు మంత్రి లోకేశ్ ఆశీర్వదించారు. అనంతరం వధూవరులు, మంత్రి రామానాయుడు దంపతులతో కలిసి రౌండ్ టేబుల్ చుట్టూ కూర్చుని గంట సేపు ముచ్చటించారు. 'మంత్రి నిమ్మల నిరాడంబరుడికి నిలువెత్తు నిదర్శనం. నిత్యం ప్రజాసేవలో తరించడం, అహర్నిశలు శ్రమించడం ఆయన ఆభరణాలు. జగన్ ప్రభుత్వం అన్నా క్యాంటీన్‌లు మూసివేసినా పాలకొల్లులో దాతల సహకారంతో ఆయన అన్నా క్యాంటీన్లను నిర్వహించడం గొప్ప విషయం' అని చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరికి చెప్పారు. లోకేశ్ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్‌కి పేదలు ఎవరైనా ఒకరోజు రాకుంటే గుర్తుపెట్టుకుని మరీ అడిగిన వ్యక్తిత్వం ఉన్న మనిషి. దటీజ్ రామానాయుడంటూ ఆయన సేవలను కొనియాడారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రు లు గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, గుమ్మడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు నందమూరి బాలకృష్ణ, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధా కృష్ణ, తోట సీతారామలక్ష్మి, కొత్తపల్లి సుబ్బారాయుడు, పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు తదితర ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించి, శుభా కాంక్షలు తెలిపారు.

కుమార్తె పెళ్లిలోనూ పసుపు చొక్కానే

తెలుగుదేశం పార్టీ కార్యకర్త నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగిన మంత్రి డాక్టర్ నిమ్మల తన జీవితంలో నిత్యం పార్టీ రంగు పసుపు చొక్కాతోనే కనిపిస్తారు. తన కుమార్తె శ్రీజ వివాహ వేడుక లోను అదే పసుపు చొక్కాతో కనిపించారు. పార్టీ పట్ల ఆయనకున్న అచంచలమైన విశ్వాసానికి ఇది నిదర్శనమని పార్టీ శ్రేణులు, సీఎం సహా పలువురు నేతలు కొనియా డారు. ఇదే సమయంలో పెద్ద సంఖ్యలో వివాహానికి హాజరైన అభిమానులు, పార్టీ శ్రేణులు పసుపు చొక్కాలు, మహిళలు చీరలు ధరించి సీఎం చంద్రబాబు దంపతులను ఆహ్వానించారు. కల్యాణ వేదిక వద్ద సందడి చేశారు.


పెళ్లికుమార్తె శ్రీజతో మాట్లాడుతున్న భువనేశ్వరి.. వధూవరులతో విందు ఆరగిస్తున్న సీఎం దంపతులు, మంత్రి లోకేశ్ తదితరులు



అధ్యక్షా..

అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ సమస్యలపై గళమెత్తారు.. ఎవరేమన్నారంటే..

• మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతించాలి



రాష్ట్ర సరిహద్దులో వున్న గ్రామాలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్-6లోని స్త్రీ శక్తి ఉచిత ప్రయాణం అంతర్రాష్ట్ర పల్లె వెలుగులో అర్హత ఉన్న మహిళలను అనుమతించడం లేదు. సరిహద్దు వరకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలి. చింతలపూడి నియోజకవర్గం తెలంగాణ సరిహద్దులో ఉంది. ఆంధ్ర బస్సుల్లో రాకపోకల్లో సరిహద్దు గ్రామాల్లోని అర్హులైన మహిళలను అనుమతించకపోవడం వల్ల ఉచిత ప్రయాణం ప్రయోజనం నెరవేరడం లేదు. వీటిని అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలి.

- చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

• ఆక్వా రైతులకు మరిన్ని రాయితీలివ్వాలి



ఆక్వా చట్టం సరళీకృతం చేయడం శుభ పరిణామం. కేంద్రం నుంచి మరిన్ని రాయితీలు పొందడానికి కృషి చేయాలి. రొయ్య రైతులకు నాణ్యమైన సీడ్, మేత, తక్కువ ఖర్చుతో రవాణా ఏర్పాటు చేయాలి. రైతులను కరెంట్ నుంచి సోలార్ వైపు మరలించడానికి రైతు లకు సోలార్ కరెంట్‌పై రాయితీలు ఇవ్వాలని కోరుతున్నా.

- ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

• ఆక్వా చట్టం రైతులకు వరం



చేపల పెంపకపు అభివృద్ధి ప్రాధికార చట్టం 25 సవరణ ఆక్వా రంగానికి మరింత ఊతమిచ్చింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులు పడేవారు. చెరువులు తవ్వుకోవాలంటే సవాలక్ష ఆంక్షలు. ఈ సవరణ ద్వారా రైతులు ఉచితంగా అనుమతులు తీసుకోవచ్చు. దీనివల్ల ఆక్వా రంగం మరింత విస్తరిస్తుంది.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

• సంప్రదాయ పరిశ్రమలను ఆదుకోవాలి



రాష్ట్రంలో సంప్రదాయ పరిశ్రమల ద్వారా అనేక లక్షల మంది కార్మికులు జీవిస్తున్నారు. కొవిడ్ తర్వాత ఆ పరిశ్రమలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. టెక్స్‌టైల్ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా పెరిగిపోయిందని పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖను ప్రశ్నించగా సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేస్తున్నట్టు ఆ శాఖ తెలిపింది.

- శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్

భైరవపట్నం రైల్వే గేటు మూసివేత

కైకలూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో మండవల్లి మండలం భైరవపట్నం వద్ద ఎల్‌సి నెం. 72వ రైల్వేగేటు మరమ్మతుల కోసం నిలిపివేశారు. బుధవారం ఉదయం నుంచి ఈ నెల 30వ తేది వరకు 7 రోజులపాటు గేటును మూసివేయడంతో వాహనదారులకు పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేలా సూచనలు చేశారు. కైకలూరు ఏలూరురోడ్డు సెంటర్లో బారికేడ్లు అడ్డుగా పెట్టి వాహనదారులకు దారిమళ్లింపు మార్గాలను సూచించారు. కైకలూరు నుంచి ముదినేపల్లి గుండా గుడివాడ వెళ్లేవారు కైకలూరు మార్కెట్‌యార్డ్ నుంచి కోరుకొల్లు, సింగరాయపాలెం మీదుగా ముదినేపల్లి, గుడివాడ వెళ్లాలని సూచించారు. అలాగే ముదినేపల్లి, కైకలూరు వచ్చే ప్రజలు సింగరాయపాలెం, కోరుకొల్లు మీదుగా కైకలూరు చేరుకోవాలన్నారు.



నేడే మెగా నియామకాలు

- ఏలూరు చేరుకున్న డీఎస్సీ అభ్యర్థులు, సహాయకులు
- 50 ప్రత్యేక బస్సుల్లో వెలగపూడికి ప్రయాణ సౌకర్యం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఉమ్మడి జిల్లాలో ఎంపికైన మెగా డీఎస్సీ అభ్యర్థులు నియామక పత్రాలు తీసుకునేందుకు వీలుగా బుధవారం ఏలూరు చేరుకున్నారు. ఉమ్మడిపశ్చిమ జిల్లాలో జోనల్ పోస్టులతో సహా మొత్తం 1231 మంది అభ్యర్థులకు గురువారం వెలగపూడిలో నిర్వహించనున్న సభలో ఉద్యోగ నియామక పత్రాలను సీఎం చంద్రబాబు అందజేయనున్నారు. ఈ సభకు హాజరయ్యేందుకు డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఏలూరులోని 9 పాఠశాలలు/ సంక్షేమ వసతి గృహాల్లో వసతిని జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసింది. అభ్యర్థులు తమ రిసీవింగ్ సెంటర్లకు ఆయా ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రమే చేరుకోగా అధికారులు నమోదు చేసుకుని ఐడీ కార్డులందజేశారు. వివిధ కారణాలతో 34 మంది ముందస్తు అనుమతి తీసుకుని మినహాయింపు పొందగా, మరికొందరు స్థానికులు రిసీవింగ్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని గురువారం ఉదయం 6 గంటలకల్లా తిరిగి హాజరయ్యేలా పర్మిషన్ తీసుకుని వెళ్లిపోయారు.

ప్రతి పది బస్సులకో వైద్యాధికారి

రిసీవింగ్ సెంటర్లలో అభ్యర్థులకు వసతి, ఇతర సౌకర్యాలను కల్పించడానికి, పర్యవేక్షించడానికి ప్రతి ఆరుగురు అభ్యర్థులకు ఒక వ్యాయామ విద్య ఉపాధ్యాయుడిని నియమించారు. ప్రతి 25 మంది అభ్యర్థులకు ఎంఈవో, ప్రతి రెండు సెంటర్లకు ఒక ఉప విద్యాశాఖాధికారి చొప్పున విద్యాశాఖ నియమించగా, సెంటర్లలో సౌక ర్యాలను పర్యవేక్షించేందుకుగాను విద్యాశాఖతో సంబంధంలేని పది మంది ప్రత్యేకాధికారులను సెంటర్‌కు ఒకరు చొప్పున కలెక్టర్ వెట్రి సెల్వి నియమించారు. తిరుగు ప్రయాణంలో అందరికీ అనువుగా ఉండేలా అభ్యర్థులను ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద దించేలా ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి గమ్య స్థానాలకు చేరుకునేందుకు అభ్యర్థులు సొంత ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

జడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం


ఆహ్వానపత్రం అందజేస్తున్న డీఈవో

ఏలూరు సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు నియా మక పత్రాలు అందజేసే కార్యక్రమానికి రావాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌కు జిల్లా విద్యాశాఖాధికారి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమానికి ఆహ్వానం రావటం సంతోషంగా ఉందని జడ్పీ చైర్‌పర్సన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వెబ్‌సైట్‌లో వైద్య ఉద్యోగార్థుల మెరిట్ జాబితా

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ ఆరోగ్య పథకం(ఎన్‌హెచ్‌ఎం) కింద కాంట్రాక్టు/ అవుట్ సోర్సింగ్ విధానంలో ఏడాది కాలపరిమితికి భర్తీచేయతల పెట్టిన 6 డేటా ఎంట్రీ ఆపరేటర్, 4 ఎల్జీఎస్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా రిమార్క్స్ కాలమ్‌లో నిర్దేశిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను సంబంధిత అభ్యర్థులు ఈ నెల 27లోగా ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించేందుకు అవకాశం ఇస్తున్నట్టు, గడువులోగా అందజేయని అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపారు.

7న ఏపీటీఎఫ్ చలో విజయవాడ


మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): పెండింగ్ డీఏలను దసరా పండుగ సందర్భంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 7న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిరావాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే పీఆర్సీని, చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. వెంటనే 30 శాతం ఇంటెరిమ్ రిలీఫ్ (ఐఆర్)ను ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై బనాయించిన కేసులను రద్దుచేయడానికి సీఎం ప్రత్యేక చొరవతీసుకోవాలని సంఘ నాయకుడు కృష్ణ డిమాండ్ చేశారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న నాగహనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రతినిధులు

నాగహనుమాన్ కంపెనీకి 'బీకే గొయెంకా' అవార్డు

దెందులూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దెందులూరులోని నాగహనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు అరుదైన గౌరవం దక్కింది. సాల్వెంట్ వెజిటెబుల్ ఆయిల్ ఇండ్రస్ట్రీస్ ట్రేడ్ అసోసియేషన్ సమావేశం ముంబైలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో నాగహనుమాన్ కంపెనీకి దేశంలోనే అత్యున్నతమైన బీకే.గొయెంకా (ఎస్ఈఏ) అవార్డును అసోసియేషన్ అందజేసింది. దేశంలోనే అత్యధిక వేగంగా నాణ్యమైన రిఫైన్డ్ బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి చేసినందుకు ఈ ప్రథమ శ్రేణి అవార్డు దక్కిందని చైర్మన్ నూకల రామకృష్ణ తెలిపారు. బుధవారం కంపెనీ చైర్మన్ నూకల రామకృష్ణ, డైరెక్టర్లు నూకల లక్ష్మణరావు, నూకల బాలాజీ, వైస్ చైర్మన్ గురుశేఖర్, టెక్నికల్ డైరెక్టర్ టి.భాస్కర్‌లు ఈ అవార్డును అందుకున్నారు. కంపెనీ యాజమాన్యం మాట్లాడుతూ తమ సంస్థ ఆయిల్, చేపలు, రొయ్యల ఫీడ్, పాలిమర్ బాక్స్‌లు, రైస్ మిల్లింగ్‌లలో నాణ్యతను పాటిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, సిబ్బందికి ఈ అవార్డును అంకితమిస్తున్నట్టు తెలిపింది.


మునిసిపల్ ఆర్‌డీ నాగ నరసింహారావుకు మొక్క అందిస్తున్న రామ్‌కుమార్

'ప్రజలకు సత్వర సేవలందించాలి'

తణుకు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):ప్రజలకు అవసరమైన సేవలను సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్, కం అప్పిలేట్ కమిషనర్ సీహెచ్. నాగ నరసింహారావు చెప్పారు. బుధవారం తణుకు మునిసిపల్ కార్యాలయంలోని ఉమ్మడి జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లతో పలు అబివృద్ధి పనులు, పుర సేవలు అమలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పుర ప్రజల కోసం తీసుకొచ్చిన పలు యాప్‌లు వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ టి.రామ్‌కుమార్‌తోపాటు ఉమ్మడి జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వేర్వేరు చోట్ల ఐదుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో బుధవారం వేర్వేరుచోట్ల మొత్తం ఐదుగురు మృతి చెందారు. భార్యపై కోపంతో వృద్ధుడు, అప్పుల బాధతో ఒకరు, మిల్లులో పనిచేస్తూ ప్రమాదవ శాత్తు ఒకరు, రహదారి ప్రమాదంలో గిరిజన మహిళ, బ్రిడ్జి పై నుంచి పడి ఒకరు మృతి చెందారు.

భార్యపై కోపంతో వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం/కామవరపుకోట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):భార్యపై కోపంతో ఒక వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గ్రామానికి చెందిన పోతురాజు సూర్యనారాయణ(70) అతిగా మద్యంతాగుతూ తరచూ భార్యతో గొడవ పడుతూ ఉంటాడు. ప్రతిసారి తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ ఉండేవాడు. ఈ నెల 23న మద్యం తాగి వచ్చి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి బయటకు వెళ్లి పురుగుల మందుతాగి వచ్చాడు. అతడి పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

అప్పుల బాధతో ఒకరు..

ఏలూరు క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నూజివీడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన కె.రాజశేఖర్(35) ఇంటి నిర్మాణం కోసం ఐదున్నర లక్షల రూపాయలు అప్పు చేశాడు. అది తీర్చే మార్గం కానరాక ఈనెల 23న పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

మిల్లులో పనిచేసే వ్యక్తి మృతి

పెనుగొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పెనుగొండలో సుబ్రహ్మణ్యం రైస్‌మిల్లులో పనిచేసే కార్మికుడు మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఇరగవరం మండలం ఐతంపూడి గ్రామానికి చెందిన దంపనబోయిన నాగేశ్వరరావు(50) మంగళవారం రైస్ మిల్లులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయి తీవ్రంగా గాయపడడంతో స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరేసరికి ప్రాణాలు విడిచినట్టు వైద్యులు నిర్ధారించారన్నారు. పెనుగొండ రైస్ మిల్లులో 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బుధవారం పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెచ్‌సీ తెలిపారు.

గిరిజన మహిళ మృతి

కుక్కునూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకుంట గ్రామానికి చెందిన పూణెం హుస్సేన్ (52) అనే గిరిజన మహిళ రహదారి ప్రమాదంలో మృతి చెందింది. కుమారుడు పూణెం రాము ద్విచక్రవాహనంపై ఆమె ప్రయాణిస్తుండగా తెలంగాణలోని సీతాయిగూడెం గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన ఆమెను అటువైపుగా వస్తున్న తెలంగాణలోని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెంటనే స్పందించి ఆమెను వైద్యశాలకు తరలించారు. ఈ క్రమంలో కొత్తగూడెంలో వైద్యచికిత్స పొందుతూ మృతి చెందింది. మృతి చెందిన కుటుంబాన్ని స్థానిక టీడీపీ నాయకులు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, జనసేన అధ్యక్షుడు ఎం. యుగంధర్ పరామర్శించారు.

ప్రత్తిపాడు బ్రిడ్జిపై నుంచి పడి ఒకరి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు మండలం ప్రత్తిపాడు బ్రిడ్జిపై నుంచి ఓ వ్యక్తి పడి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెంలోని టిడ్కో ఇంటిలో నివాసం ఉంటున్న పాతగొలుసు రాజేష్‌బాబు(42) ఫుడ్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్తున్నానని భార్యతో చెప్పి బయటకు వచ్చాడు. అనంతరం బ్రిడ్జిపై నుంచి పడిపోయినట్టు సమాచారం. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పెంటపాడు హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఒకరి మరణానికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

సహకరించిన భార్యకు జరిమానా

ఏలూరు క్రైం : ఓ వ్యక్తిపై దాడి చేసి అతడి మృతికి కారణమైన ప్రధాన ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష, సహకరించిన అతడి భార్యకు రూ.5వేలు జరిమానా విధిస్తూ ఏలూరు జిల్లా రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని బుధవారం తీర్పునిచ్చారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెం హైస్కూలు రోడ్డులో రాయల వీరయ్య(64) తన భార్యతో చిన్న కుమారుడైన నానితో కలిసి ఉంటున్నారు. నానికి జంగారెడ్డిగూడెంకు చెందిన పద్మతో వివాహమైంది. ఈ క్రమంలో నాని ఇంటి ఎదురుగా నివాసముంటున్న పి.వెంకటరమణతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈవిషయంలో తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ ఘటన జరగడానికి నాలుగు నెలల ముందు పద్మ జంగారెడ్డిగూడెంలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా వెంకటరమణ జంగారెడ్డిగూడెం వెళ్లేవాడు. ఈక్రమంలో 2015 జనవరి 15న సంక్రాంతి పండుగ నేపథ్యంలో వీరయ్య తన ఇంటి వద్ద బంధు వులతో కలిసి పిండివంటలు చేసుకుంటూ పండుగ సమయంలో పిల్లలను ఇంటి వద్ద లేకుండా చేసిందని తన కోడలు పద్మను తిడుతుండగా ఇంటి ముందే ఉన్న వెంకటరమణ కల్పించుకుని గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరగడంతో వెంకట రమణ వీరయ్యపై దాడి చేశాడు. వెంకటరమణ భార్య.. భర్తతో కలిసి వీరయ్యపై దాడికి దిగింది. ఆ మరుసటి రోజున కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వీరయ్య మృతి చెందాడు. ఈ కేసు ఏలూరులోని రెండో అదనపు సెషన్స్ కోర్టులో నేరం రుజువైనందున ముద్దాయి వెంకటరమణకు ఐదేళ్ల జైలు, నేరానికి సహకరించిన అతని భార్య వెంకటలక్ష్మికి రూ. 5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని బుధవారం తీర్పునిచ్చారు.

వృద్ధురాలిపై సైబర్ నేరగాళ్ల వల

- రూ. 51 లక్షలు అపహరణ

ఏలూరు క్రైం : వృద్ధ మహిళను డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేసి ఆమె వద్ద నుంచి రూ.51 లక్షలను అపహరించిన ఘటన ఏలూరులో జరిగింది. వివరాలివి.. ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన ఒక వృద్ధురాలు(66) భర్తతో కలిసి జీవిస్తున్నారు. గతంలో న్యాయవాదిగా వృత్తిని కొనసాగించారు. వీరి పిల్లలు విదేశాల్లో సెటిల్ అయ్యారు. ఆ వృద్ధురాలు గ్రీన్‌కార్డు హోల్డర్. ఈ నెల 13న గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్‌చేసి మీ ఆధార్ నంబర్‌పై సిమ్ కొనుగోలు చేసి అసాంఘిక కార్యక్రమాలను వినియోగిస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అనంతరం వీడియో కాల్స్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ దుస్తుల్లో ఉన్న ఒక వ్యక్తి తాను బెంగళూరుకు చెందిన పోలీసు అధికారులమని మీపై ముంబై ప్రాంతంలో బ్యాంకు ఖాతాలు ఉన్నాయని వాటి ద్వారా నేరస్తులకు నగదు బదిలీ అయిందని మీపై కేసులు నమోదయ్యాయని బెదిరించి, వాటికి సంబంధించిన నకిలీ పత్రాలను వాట్సాప్ ద్వారా ఆమెకు షేర్ చేశాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని తెలిపారు. ఆ వృద్ధురాలు బయట పడేయమని వారిని కోరగా.. ఆమె నుంచి ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు దఫదఫాలుగా అక్షరాల 51 లక్షల రూపాయలను సైబర్ నేరగాళ్ల అకౌంట్లకు చెల్లించారు. చివరకు తాను మోసపోయానని బుధవారం ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూ టౌన్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3న పాలకొల్లు బార్ అసోసియేషన్ ఎన్నికలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):పాలకొల్లు బార్ అసోసియేషన్ ఎన్నికలు అక్టోబరు 3వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను వచ్చే బుధవారం దాఖలు చేసుకోవచ్చునని, గురువారం నామినేషన్ల పరిశీలన అనంతరం 26న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. పోలింగ్ అక్టోబరు 3వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని ఎన్నికల అధికారి వెల్లడించారు.

ఆరుళ్లలో ఉల్లాస్

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇల్లాలు చదువుకోవాలని అప్పుడే ఇల్లు ఆనందంగా ఉంటుందని మాజీ సర్పంచ్‌లు గూడవల్లి నాగేశ్వరరావు, మాకరాజు సతీష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బెజవాడ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆరుళ్లలో డ్వాక్రా ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా ప్రభుత్వ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీసీ సుజాత, వీఓఏలు, గ్రామ డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జీఎస్టీ అమలుపై ఎంపీ ఆరా



స్టీమర్‌రోడ్ మార్కెట్‌లో పర్యటిస్తున్న ఎంపీ పాకా సత్యనారాయణ

నరసాపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో ఎంపీ పాకా సత్యనారాయణ బుధవారం జీఎస్టీ అమలుపై ఆరా తీశారు. స్టీమర్‌రోడ్‌లోని ప్రధాన ఎలక్ట్రానిక్ షాపులకు వెళ్లి ఏ వస్తువుకు ఎంత తగ్గింది అన్న విషయాన్ని యాజమానుల్ని అడిగి తెలుసుకున్నారు. జీఎస్టీ తగ్గిన తరువాత వస్తువుల అమ్మకాలపై ఆరా తీశారు. అనంతరం వినియోగదారులతో మాట్లాడారు. ప్రజలకు పన్నుల భారం తగ్గించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందన్నారు. ఈ తగ్గింపు వల్ల ప్రతి కుటుంబానికి పెద్ద మొత్తంలో ఆదా ఉంటుందన్నారు. దీని వల్ల ప్రజల్లో మరింత కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. ఆయన వెంట గునిశెట్టి శ్రీను, వనమాల శ్రీను, గన్నబత్తుల సత్యవతి, మునికోటి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు ఎంపీడీవోగా బాబూరావు



ఎంపీడీవో బాబూరావు

ఆకివీడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దాకరపు బాబూరావు బుధవారం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న బాబూరావును ఎంపీడీవోగా పదోన్నతిపై ఆకివీడు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఈవోపీఆర్డీ ఈదా మార్కండేశ్వరరావు ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు.

బ్లాక్‌లో టిక్కెట్ల అమ్మకాలకు చెక్

ఆకివీడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఓజీ సినిమాకు ఆకివీడులో బ్లాక్ టిక్కెట్లు అమ్మకాలు జరగకుండా జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు పిల్లా బాబులు చెక్ పెట్టారు. బుధవారం అర్ధరాత్రి స్థానిక థియేటర్లలో షోలు వేస్తున్న సందర్భంగా బ్లాక్‌లో టిక్కెట్లు అమ్మకాలు జరగకుండా జనసేన పార్టీ కార్యాలయంలోనే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు జరిపారు.

శృంగవృక్షంలో స్వచ్ఛ భారత్

పాలకోడేరు, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శృంగవృక్షం గ్రామంలో బుధవారం మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు బుద్ధరాజు బలరామకృష్ణంరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి అనే నినాదాన్ని గ్రామస్తులకు చెప్పడంతో పాటు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, ఉండి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కోరా రామ్మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ కుమార్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఇంజేటి వెంకటేశ్వర్లు, వీరవల్లి ప్రసాద్, కొండేపూడి రామారావు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి అన్నారు. దండగర్ర, జగన్నాథపురం గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త సేకరణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ట్యాక్స్ కలెక్షన్‌పై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం వెంకటేష్, సర్పంచ్‌లు ఉండ్రాజవరపు చంద్రిక, పిల్లా రాంబాబు, కార్యదర్శులు బాలగోపాల చంద్రరాజు, ముత్తయ్య పాల్గొన్నారు.

సేవాభావంతో ముందుకు సాగాలి

గణపవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):దేశభక్తి, సేవా భావంతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుకుసాగాలని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నానో యూరియా వినియోగం పెంచాలి

గణపవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో యూరియా వాడకం తగ్గించటంతో మంచి దిగుబడులు సాధించవచ్చని తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు గంగాధర్ అన్నారు. బుధవారం జల్లికొమ్మరలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో యూరియా వాడకం తగ్గించాలని, నానో యూరియా, నానో డీఏపీ వాడకం పెంచాలని రైతులకు సూచించారు. అన్నదాత సుఖీభవ పడనివారు తక్షణం రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు డ్రోన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ మద్దాల మహంకాళి పాల్గొన్నారు.

ఆరుళ్ల ధర్మకర్తల మండలి చైర్మన్‌గా శ్రీనివాసరావు



ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఆరుళ్ల వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కట్టా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. శ్రీనివాసరావుతోపాటు సభ్యులుగా కట్టా శ్రీనివాసరాజు, రాళ్లభట్టు భారతి, అయిలూరి నాగబాబు, జెట్టి ఈశ్వరి, అన్నవరపు సాయిదుర్గారావు, జె.నాగలక్ష్మి, మంగళగిరి, బుల్లెమ్మరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, మాజీ సర్పంచ్ గూడవల్లి నాగేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షుడు చిటకన శ్రీను, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బెజవాడ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

ఉండి, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే తన ధ్యేయమని ఉండిలోని విశాల సహకార బ్యాంక్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి వెల్లడించారు. బుధవారం బ్యాంక్ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. బ్యాంక్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి మాట్లాడుతూ పాత, మొండి బకాయిలు రు.15కోట్లుకు గాను రూ.12కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. బ్యాంక్‌కు సంబంధించి రూ.2కోట్ల నిధులు దుర్వినియోగం చేసిన నలుగురు ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని ఛైర్మన్ సూరి తెలిపారు. బ్యాంక్ కార్యదర్శి శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, మార్కెట్ యార్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు కలిదిండి శ్రీనుబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఉండి బస్టాండ్ ఎదురుగా వున్న గుండాబత్తుల సుబ్బారావు నివాస ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెంతెకోస్తు ప్రార్థనా మందిరం భీమవరం, ఎఫ్ఎఫ్‌సీఐ, యుఎన్, యుపీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. గైనకాలజీ, గ్యాస్ట్రిక్ సమస్యలు, జనరల్ మెడిసన్, గుండె, కంటి పరీక్షలు నిర్వహించారు. పాస్టర్ను కుటుంబాలతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో రోగులు విచ్చేసి వైద్యసేవలు పొందారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉండి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నడిపూడి మనోజ్(18) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉండి గ్రామం నిమ్మనపేటకు చెందిన స్నేహితులు రామమోహన్, మనోజ్‌లు ఉండి సెంటర్ నుంచి వర్షంలో నిమ్మనపేటకు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. స్టేషన్‌రోడ్‌కు సమీపంలోని సాయిబాబా ఆలయం ఎదురుగా వచ్చేసరికి అటు నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈప్రమాదంలో మోటర్‌సైకిల్ వెనుక కూర్చున్న మనోజ్ వాహనంపై నుంచి కిందపడిపోయి అక్కడే మృతిచెందాడు. మోటర్‌సైకిల్ నడుపుతున్న రామమోహన్ గాయపడ్డాడు. అతడిని 108లో భీమవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.








అన్నపూర్ణాదేవిగా ఆకివీడులో పెద్దింట్లమ్మ.. పెదమల్లంలో మాచేనమ్మ.. క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు.. ముత్యాలంబపురంలో గాయత్రిదేవిగా ముత్యాలమ్మ.. భీమవరంలో శారదా మాతకు ధనలక్ష్మి అలంకరణ.. ముత్యాలపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ అప్పలనాయుడు

అమ్మా.. అన్నపూర్ణేశ్వరి

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు

సామూహిక కుంకుమ పూజలు..యాగాలు

ఆకివీడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం పెద్దింట్లమ్మ భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అదే విధంగా వనువులమ్మ, గంగానమ్మ-మద్దిరావమ్మ, కనకదుర్గమ్మ తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

తణుకు: భాష్యం బ్లూమ్స్ స్కూల్‌లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. భాష్యం వెస్ట్‌జోన్ ఇన్‌చార్జి ఎ. శ్రీమన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు నేర్పడం తమ లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులు దుర్గాదేవి, శక్తి రూపాలపై ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశాలాక్షి, వైస్ ప్రిన్సిపాల్ పాండు రంగారావు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: ఎల్‌బిచర్ల గ్రామంలో గంగాలమ్మ అమ్మవారికి బుధవారం చండీయాగం నిర్వహించారు. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాదన నిర్వహించారు.

మొగల్తూరు:పార్వతీ విశేశ్వరస్వామి ఆలయం, భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ, ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయంతో పాటు కాళీపట్నం, పేరుపాలెం, శేరేపాలెం, కెపిపాలెం గ్రామాల్లోని దుర్గమ్మ అమ్మవార్లతో పాటు కూరగాయల మార్కెట్, కుక్కలవారితోట, పడమటిపాలెం గ్రామాల్లో నిలబెట్టిన అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పులిహోర, దద్దోజనం, బూంది లడ్డులు భక్తులు నివేదించారు.

ఆచంట:మండలంలో ఉదయం సాయంత్రం అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. 3వ రోజు అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పెదమల్లంలోని మాచేనమ్మ, ఆచంటలోని పార్వతి అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

పెనుగొండ:మూడవ రోజు బుధవారం అన్నపూర్ణ దేవిగా పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

భీమవరం టౌన్: దేవీ నవరాత్రుల సందర్భంగా మావుళ్ళమ్మ అమ్మవారు భక్తులకు బుధవారంనాడు గాయాత్రీ మాతగా దర్శనమిచ్చారు. ఆలయంలో లక్ష కుంకుమార్చన, చండీ హోమాలు నిర్వహించారు. శ్రీరాంపురం రోడ్డులోని జగన్మాత కనకదుర్గమ్మ అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరణ చేశారు. మెంటేవారితోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరణ చేశారు. త్యాగరాజ భవనంలోని శ్రీవాసవీ కన్యకా పర మేశ్వరి దేవి అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరణ చేశారు. సోమేశ్వరాలయంలోని అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరణ చేశారు భీమేశ్వరస్వామి వారి ఆలయంలోని మహిషాసుర మర్దీనీ అమ్మవారిని గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం కల్పించారు. రెస్ట్‌హౌస్ రోడ్డులోని శారద మాత అమ్మవారిని ధనలక్ష్మి అలంకరణ చేశారు. రూ.50, 100, 500 నోట్ల కరెన్సీతో అమ్మవారికి అలంకరణ చేశారు

కాళ్ళ: కాళ్ళకూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడవ రోజు బుధవారం ధైర్యలక్ష్మిగా శ్రీలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. యతిరాజుల ఆండాళ్ గోష్ఠి వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, అష్టోత్తర శత నామార్చన, ఆలయ ప్రదక్షిణ చేశారు.

పెంటపాడు: పెంటపాడు షిరిడీ సాయిబాబా ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆలయ కమిటి అధ్యక్షుడు కొప్పూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి శ్రీనివాస్, సురేఖ దంపతులు పీటలపై కూర్చొని పూజలు నిర్వహించారు.

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం పురదేవత బలుసులమ్మ అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాత్యాయనిగా అలంకరించారు. శ్రీవాసవీ కన్యకా మాత కాశీఅన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. వీకర్సకాలనీలోని గాయత్రి అమ్మవారిని కూడా అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. రాజరాజేశ్వరి హోల్‌సేల్ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

పాలకొల్లు అర్బన్: క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించారు. వాసవీ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో చిన్న గోపురం వీధిలోని కళ్యాణ మండపంలో అమ్మవారిని శ్రీశైలభ్రమరాంబికాదేవిగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణం చేశారు. యడ్లబజారు కనక దుర్గమ్మవారిని చాంముండేశ్వరి దేవిగా అలంకరించారు.

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శ్రీ బాలా త్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో గురువారం అమ్మవారికి చంద్రఘంటా దేవిగా అలంకరించారు. నిర్వాహకులు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మేధా సరస్వతి అమ్మ వారి ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ముత్యాలంబపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి వేద మాత గాయత్రి దేవి అలంకరణ చేశారు.

పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలి

పాలకోడేరు, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద 'పోషణ మా' యాక్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆరు నెలలలోపు పిల్లలు అందరికీ తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నెలలు నిండిన పిల్లలకు తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని, ఏ వయస్సుకి ఎంత ఆహారం ఇవ్వాలి? ఎన్నిసార్లు ఇవ్వాలి అనే విషయాలు గురించి వివరించారు. సీడీపీవో వాణి విజయరత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి, అంగన్‌వాడీ వర్కర్స్ నాగలక్ష్మి, పుష్ప, తల్లులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

తణుకు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, అక్షరాతస్యత కార్యక్రమాలు, బాలికా విద్య, మహిళా సాధికారత, ప్రకృతి విపత్తులు సమయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్యామాలాదేవి పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు

ఉండి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):సంతమార్కెట్ దాటుకుని వెళ్లే శ్మశానం రహదారి నుంచి కాలనీకి వెళ్లే గ్రావెల్ రహదారి అభివృద్ధికి రు.15లక్షలు అంచనా వేసి ప్రతిపాదించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి తెలిపారు. బుధవారం ఉండిలో వర్షాలకు పాడైన రహదారులను, డ్రెయిన్లను వారు పరిశీలించి మాట్లాడారు. ఉండి కొత్తపేటలోని డ్రైయినేజీ వర్షం వస్తే ముంపుబారినపడుతుందని, అలాగే కోండ్రుతుపేటలోని డ్రెయినేజీ, సీసీ రహదారి పల్లపు ప్రాంతంలోనివి కావడంతో అధ్వానంగా మారాయన్నారు. వీటిని అభివృద్ధి పరచడానికి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటి వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, కరిమెరక సత్యనారాయణ, గ్రామకార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం ఏ గ్రేడ్ రకం రూ.2389

పాలకోడేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ధాన్యం సేకరణపై పాలకోడేరు సొసైటీ సీఈవో నరసింహరాజు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిణి బి.సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఏవో మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం మద్దతు ధర వరి ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2389గాను, కామన్ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2369గాను నిర్ణయించిందని అన్నారు. ముఖ్యంగా ఎంటీయూ 7029, ఎంటీయూ 1318, పీఎల్‌ఏ 1100 కామన్ రకాలుగా గుర్తించబడతాయని, దీనిని రైతులు గమనించాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్మినట్లయితే రైతులు వేలిముద్ర వేసిన 48 గంటల్లో ధాన్యం డబ్బులు రైతు ఖాతాకి జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భారతి విజయలక్ష్మి, ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వివాహానికి వర్షం అడ్డు రాకూడదని పూజలు



సూర్యానారాయణ స్వామికి బూరెలు నివేదన చేసిన మహిళలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ, పవన్‌ల వివాహం శుభంగా జరగాలని వర్షం ఆటకం కలిగించకూడదని కోరుతూ అభిమానులు స్థానిక కోడిగట్టున గల సూర్యభగవానుడికి బూరెలు నివేదన చేసి ప్రత్యేక పూజలు చేశారు. కాజ గ్రామానికి చెందిన శ్రీరామ్ హోటల్ యజమాని మేళం రాము, మిత్రులతో కలిసి వరుణ దేవుడు కరుణించాలని, సూర్య భగవానుడు దయ చూపాలని ముత్తైదువలతో బూర్లు నివేదనగా సమర్పించారు. కొన్ని రోజులుగా వర్షం కురుస్తుండటం దృష్టిలో పెట్టుకుని పండితుల సూచనల మేరకు ఈకార్యక్రమం చేపట్టామని రాము తెలిపారు. కార్యక్రమంలో వైవి లంక సొసైటీ అధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వరరావు, ముచ్చర్ల ధర్మరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు వినుకొండ వెంకట బ్రహ్మాజీ, ముచ్చర్ల చిన్ని మహిళలు పాల్గొన్నారు, నివేదన అనంతరం బూరెలను వివాహానికి వచ్చిన వారికి పంపిణీ చేశారు



సీఎం చంద్రబాబును కలిసిన కోళ్ళ, గన్ని, వలవల

సీఎం చంద్రబాబును కలసిన నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్/తణుకు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహానికి హాజరైన సీఎం చంద్రబాబును మర్యాదుపూర్వకంగా ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భవన కార్మిక సంక్షేమ మండలి ఛైర్మన్ వలవల బాబ్జి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు కలిశారు.

నెలాఖరుకు నూరుశాతం పశువులకు టీకాలు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పశువర్థకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాలను నియోజకవర్గంలోని 27 గ్రామాల్లో పూర్తి చేసినట్లు ఆశాఖ ఏడీఏ డాక్టర్ సురేంద్రకుమార్ తెలిపారు. నరసాపురంలో 9800 మొగల్తూరులో 9787 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామన్నారు. ఈనెలాఖరు నాటికి నూరుశాతం పశువులకు టీకాలు వేస్తామన్నారు.

స్కూళ్ల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నరసాపురం, మొగల్తూరు జోనల్ కమిటీలు ప్రైవేట్ స్కూళ్ల అభివృద్ధికి కృషి చేయాలని మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. పట్టణంలోని సెంట్‌ఆన్స్ స్కూల్‌లో నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యా రంగంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం నరసాపురం, మొగల్తూరు జోనల్ అధ్యక్షులుగా ఎస్.సరళ, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా జోయల్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుందరరావు, మణిక్యాలరావు, డాక్టర్ రాజ్యలక్ష్మి, ఏడుకొండలు, కృష్ణ, బీరాఫిన్ని, జక్కంశెట్టి రాకేష్‌లు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో వేద పారాయణ

భీమవరం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మావుళ్లమ్మ దేవస్థానంలో బుధవారం సాయంత్రం వేదపండితులచే వేద సభ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం వేద సభలో పాల్గొన్న వేదపండితులకు దేవస్థానం సహాయ కమిషనర్ శేషవస్త్రంతో సత్కరించారు. ముందుగా నాలుగు వేదాలను అమ్మవారి ఎదుట పారాయణ చేశారు.

రైతులకు ఎలుకల మందు పంపిణీ

ఆచంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):ఆచంట వేమవరంలో బుధవారం ఎలుకల మందును రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, పాలకొల్లు ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో బి. నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు నెక్కంటి సత్తిబాబు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఆచంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):గోకులం షెడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిఅయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి. కృష్ణమోహన్ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. రైతులకు ప్రయోజనం కలిగేలా ఈ నిర్మాణాలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

పంట కాలువ తవ్వకం పనుల పరిశీలన



పంటకాలువను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ శివరామరాజు

కాళ్ళ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి):నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలగకుండా కాలువల ప్రక్షాళన పనులు చేస్తున్నట్లు ఆకివీడు డీసీ చైర్మన్ గోకరాజు వెంకట శివరామరాజు తెలిపారు. ఎల్ఎన్ పురం గ్రామం వద్ద బొండాడ- మాలవానితిప్ప పంట కాలువకు సుమారు 23 కి.మీ. మేర జరుగుతున్న ప్రక్షాళన పనులను బుధవారం పర్యవేక్షించారు. నీటి సంఘాల అధ్యక్షులు మండపాటి కృష్ణమూర్తి, అల్లూరి దొరయ్య చౌదరి, టీడీపీ మండలాధ్యక్షుడు ఆరేటి వెంకటరత్న ప్రసాద్, బొండాడ సర్పంచ్ మన్నే నాగరాజు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలి

పెంటపాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : రైతులు తప్పనిసరిగా పంటలు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని ఏవో చీర్ల రవికుమార్ అన్నారు. మంగళవారం వల్లూరుపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ధాన్యం కొనుగోళ్ళపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకేవైసీ నమోదు చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి రామారావు, అడ్డగర్ల గంగరాజు, ఏఈవో భాగ్యరత్నం, వీఏఏ హరికృష్ణ పాల్గొన్నారు.

అమ్మవారి పీఠానికి 100గ్రాముల వెండి అందజేత

భీమవరం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి బుధవారం పట్టణానికి చెందిన జవ్వాది చంద్రరావు, హేమలత దంపతులు 100 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. మావుళ్లమ్మ అమ్మవారి స్వర్ణ వస్త్ర నిధికి ఆకివీడు సిద్ధాపురానికి చెందిన కలిదిండి వెంకట బుచ్చి తిరుపతి రాజు 8 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ళ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆనందపురం, మేకలదిబ్బ, గూట్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

బస్ కాంప్లెక్స్ పరిశీలన



ప్రయాణికులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో రూ.55 లక్షలతో నిర్మించిన నూతన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను బుధవారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సందర్శించారు. ప్లాట్‌ఫామ్‌లు, రిజర్వేషన్ కౌంటర్, కార్గో కౌంటర్లను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేకూరి రామబద్రిరాజు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో నూతన ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, పార్టీ నాయకులు కాయిత సురేంద్ర, షేక్ మొహిద్దిన్, అడబాలశివ, వబిలిశెట్టి ప్రసాద్, భూపతిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్య, మధ్య తరగతికి మేలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):స్వదేశీ వస్తువుల్ని కొనాలని దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కోరారు. ఉండి రోడ్డులోని అపే షోరూమ్ ను ఆయన సందర్శించారు. ధరణి మోటార్స్‌లో ఆటో కొనుగోలు కోసం వచ్చిన పలువురు వినియోగదారులతో జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగిన ప్రయోజనాల గురించి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అడిగి తెలుసుకున్నారు. గతంలో 28 శాతం ఉన్న జీఎస్టీ 18 శాతానికి తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల 22 వేల రూపాయలు ఒక ఆటో పై తగ్గిందని ఇది తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆటో డ్రైవర్ తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ మధ్యతరగతి, సామాన్య ప్రజలకు జీఎస్టీ తగ్గించడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం మెడికల్ షాపులను కూడా ఆయన సందర్శించి వినియోగదారులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పేరిచర్ల సుభాష్ రాజు, వబిలిశెట్టి ప్రసాద్, శివ, షేక్ మొహిద్దిన్, రాజశేఖర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

భీమవరంలో వర్షం

భీమవరం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):అల్పపీడన ప్రభావంతో బుధవారంరాత్రి భీమవరంతోపాటు పరిసర ప్రాంతాలల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగా ఉంది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో వర్షం పడటంతో జనజీవనానికి ఇబ్బంది కలిగింది. ఆ తర్వాత మరలా రాత్రి 10 గంటల ప్రాంతంలోను చినుకులు పడుతూనే ఉన్నాయి.

మంత్రి సవితకు అవార్డు పట్ల హర్షం

భీమవరం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమం , జౌళి వస్త్ర పరిశ్రమ శాఖ మంత్రి సవితమ్మకి దేశస్థాయి ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డు లభించడం పట్ల కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం మంత్రి సవితమ్మ చేసిన అద్భుతమైన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత గౌరవమే కాకుండా, మన రాష్ట్రానికి, బీసీ వర్గాల అభివృద్ధికి దక్కిన గొప్ప గౌరవం అని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ ఛైర్మన్‌లు అందరూ కలిసి మంత్రి సవితమ్మకి శాలువాతో, స్మృతిచిహ్నంతో ఘనంగా సన్మానం చేశారు.